

# నిజం
## దృష్టి తెలుగు న్యూస్

TG/TEL/25/A3731

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-257 పేజీలు:-4 మంగళవారం 01-09-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

## 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'

సభలో బోరున విలపించిన కవిత



- బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత
- సభలో కన్నీటి పర్యంతమైన కవిత
- "కవిత సీఎం" అంటూ కార్యకర్తల నినాదాలు
- కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత
- తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో సమాధానమిస్తామని ప్రతిన

బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు - మిగతా 2 లో

## ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం

రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్



- వెలిగొండకు కృష్ణా జలాల తరలింపుపై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు
- తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపణ
- రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్ విఫలమయ్యారని ధ్వజం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్
- కృష్ణా బోర్డు ప్రేక్షకపాత్ర పోషిస్తోందని హరీశ్ రావు ఆక్షేపణ

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి - మిగతా 2 లో

## పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం

# కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి ఫైర్

- మూసారాంబాగ్ వద్ద కొత్త బ్రిడ్జిని ప్రారంభించిన ముఖ్యమంత్రి
- పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేనిది రెండేళ్లలో చేసి చూపించామన్న సీఎం
- కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారని తీవ్ర ఆరోపణ
- ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని వెల్లడి




గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## బిష్కెక్‌లో ప్రధాని మోదీకి

# ప్రవాస భారతీయుల ఘన స్వాగతం

- ఎస్‌సీఓ సదస్సు కోసం కిర్గిస్థాన్ చేరుకున్న ప్రధాని మోదీ
- బిష్కెక్‌లో ప్రవాస భారతీయుల నుంచి ఘన స్వాగతం
- 'భారత్ మాతా కీ జై' నినాదాలతో హోరెత్తిన పరిసరాలు
- రెండు రోజుల పాటు పలు ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొననున్న ప్రధాని
- భద్రత, కనెక్టివిటీ, అవకాశాలే లక్ష్యంగా భారత్ ముందుకు




షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) 26వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు కిర్గిస్థాన్ చేరుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీకి రాజధాని బిష్కెక్‌లో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా అక్కడి ప్రవాస

## లారక్ ద్వీపంపై అమెరికా డ్రోన్ దాడులు

ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్

- ఇరాన్‌లోని లారక్ ద్వీపంపై అమెరికా సైనిక దాడి
- రెండు ఇరానియన్ లాంచర్లను ధ్వంసం చేసినట్లు వెల్లడి
- సముద్రంలో మైన్స్ పెట్టేందుకు ఇరాన్ యత్నించిందని ఆరోపణ
- దాడిలో పలువురు మృతి, ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్
- హర్మూజ్ జలసంధిలో పెరిగిన తీవ్ర ఉద్రిక్తత




## బెంగళూరు వచ్చి బాధితులతో మాట్లాడండి

రాహుల్‌కు కుమారస్వామి సవాల్



- కేపీఎస్సీ నియామకాల కుంభకోణంపై రాహుల్ గాంధీ మౌనాన్ని ప్రశ్నించిన కుమారస్వామి
- కోట్లాది రూపాయలకు పోస్టులు అమ్ముకున్నారని తీవ్ర ఆరోపణలు
- ప్రశ్నపత్రాలను రిసార్టులకు తీసుకెళ్లి అభ్యర్థులకు శిక్షణ ఇచ్చారని వ్యాఖ్య
- బెంగళూరు వచ్చి బాధితులతో చర్చించాలని రాహుల్ గాంధీకి సవాల్ - మిగతా 2 లో

## భారతీయులకు ఉజ్బెకిస్థాన్ గుడ్ న్యూస్.. 30 రోజుల వీసా ఫ్రీ ప్రయాణం

- పర్యాటకం, వాణిజ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఉజ్బెకిస్థాన్ నిర్ణయం
- గతేడాది తొలిసారి 1 బిలియన్ డాలర్లు దాటిన ద్వైపాక్షిక వాణిజ్యం
- భారత్ తమకు నమ్మకమైన భాగస్వామి అని చెప్పిన ఆ దేశ అధ్యక్షుడు
- ప్రధాని మోదీ తాష్కెంట్ పర్యటనలో వెలువడిన ఈ కీలక ప్రకటన



భారత పౌరులకు ఉజ్బెకిస్థాన్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. భారతీయులకు 30 రోజుల పాటు వీసా రహిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఇరు దేశాల మధ్య పర్యాటకం, వ్యాపార సంబంధాలు, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కీలక - మిగతా 2 లో

## నేపాల్ విపత్తుకు కారణం ఇదే.. డ్రోన్ వీడియోలో రికార్డైన భయానక దృశ్యాలు!

- నేపాల్‌లో కుప్పకూలిన భారీ హిమానీనదం
- డ్రోన్ వీడియోలో రికార్డైన ప్రళయ దృశ్యాలు
- వరదల కారణంగా నేపాల్, టిబెట్‌లో వందల మంది మృతి
- వేలాది మంది గల్లంతు, కొనసాగుతున్న సహాయక చర్యలు
- హిమాలయాల్లో పెరుగుతున్న ప్రమాదాలకు ఇదో సంకేతమన్న నిపుణులు



హిమాలయ పర్వతశ్రేణుల్లోని లాంగ్‌టాంగ్ లిరుంగ్ శిఖరం వద్ద ఓ భారీ హిమానీనదం, దాని కింద ఉన్న రాతి పొరలు సహా కుప్పకూలింది. ఈ ప్రళయానికి సంబంధించిన భయానక దృశ్యాలు డ్రోన్ కెమెరాలో రికార్డయ్యాయి. - మిగతా 2 లో

## ఆ ప్రమాద మృతుల కుటుంబాలకు

# రూ.10 లక్షల చొప్పున సాయం

- చిలకలూరిపేట రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం
- సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ
- ఈ నెల 27న ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొట్టిన ఘటన
- ఒకే గ్రామానికి చెందిన 8 మంది మృతి చెందిన విషాదం




పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అండగా నిలిచారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున

## వెలిగొండపై మాటల యుద్ధం.. జగన్ కు లోకేశ్ కౌంటర్



- వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం... టీడీపీ, వైసీపీ విమర్శల పర్వం
- నీళ్లు లేకుండానే జగన్ ప్రాజెక్టును ప్రారంభించారంటూ లోకేశ్ ఎద్దేవా
- తొలి దశ పూర్తి చేసి నల్లమల సాగర్‌లోకి నీటిని విడుదల చేసిన చంద్రబాబు
- తన తండ్రి, తన ఘనతేనంటూ ముందురోజు పోస్ట్ పెట్టిన జగన్

ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని పలు - మిగతా 2 లో

## రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన



- సెప్టెంబర్ 1, 2 తేదీల్లో వైఎస్ జగన్ పులివెందుల పర్యటన
- వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్
- ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తండ్రికి నివాళులు
- పర్యటనలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండనున్న మాజీ సీఎం

వైసీపీ అధినేత జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో - మిగతా 2 లో

# బిష్కెక్‌లో ప్రధాని మోదీకి ప్రవాస భారతీయుల ఘన స్వాగతం

మొదటిపేజీ తరువాయి - భారతీయులు ఆయనకు సాదరంగా ఆహ్వానం పలికారు. విమానాశ్రయం నుంచి హోటల్‌కు చేరుకున్న ప్రధాని మోదీని చూసేందుకు పెద్ద ఎత్తున ప్రవాస భారతీయులు తరలివచ్చారు. 'భారత్ మాతా కీ జై', 'వందే మాతరం' వంటి నినాదాలతో ఆ ప్రాంగణం మారుమోగింది. ఈ సందర్భంగా కొందరు యోగా ఆసనాలను ప్రదర్శించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ విశేష ఆదరణపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "భారత్ నుంచి బిష్కెక్ వరకు.. ఈ సాయంత్రం భారత సమాజం అందించిన స్వాగతం అత్యంత ప్రత్యేకమైనది" అని పేర్కొన్నారు. అంతకుముందు మానస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కిర్గిస్థాన్ క్యాబినెట్ ఆఫ్ మినిస్టర్స్ ఛైర్మన్ ఆదిల్‌బెక్ కాసిమాలియేవ్ ప్రధానికి అధికారికంగా స్వాగతం పలికారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఎస్‌సీఓ సదస్సులో పాల్గొనడంతో పాటు పలువురు దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నట్లు మోదీ వెల్లడించారు. పర్యటనకు బయలుదేరే ముందు ఆయన మాట్లాడుతూ.. భద్రత, కనెక్టివిటీ, అభివృద్ధి అవకాశాల ప్రాతిపదికన ఈ ప్రాంతంలో భారత్ తన దార్శనికతను ముందుకు తీసుకెళ్తుందని పేర్కొన్నారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం లేని ప్రాంతం కోసం సభ్య దేశాలతో సమన్వయంతో పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. తన పర్యటనలో భాగంగా కిర్గిస్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అనంతరం 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ వేడుకలకు ఆయన హాజరుకానున్నారు. ఈ పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని కిర్గిస్థాన్ ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# బెంగళూరు వచ్చి బాధితులతో మాట్లాడండి

మొదటిపేజీ తరువాయి - కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ (కేపీఎస్సీ) నియామకాల కుంభకోణంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మౌనం వహించడాన్ని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి విమర్శించారు. ఈ వ్యవహారంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన ధ్వజమెత్తారు. నిన్న బెంగళూరులోని జేడీఎస్ ప్రధాన కార్యాలయం 'జేపీ భవన్'లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కుమారస్వామి మాట్లాడారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి.. "మీరు ఎక్కడున్నారు? ఇక్కడ కేపీఎస్సీ వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పడుతోంది. దేశమంతా పర్యటిస్తూ విద్యార్థులు, యువతతో ముచ్చటించే మీరు.. బెంగళూరుకు ఎప్పుడు వచ్చి కేపీఎస్సీ బాధితుల సమస్యలపై చర్చిస్తారు?" అని నిలదీశారు. ఈ కుంభకోణంలో కోట్లాది రూపాయలకు పోస్టులను అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు. "ప్రశ్నపత్రాలను రిసార్టులకు తరలించి, డబ్బు చెల్లించిన అభ్యర్థులకు ముందే అందజేశారు. సమాధానాలు ఎలా రాయాలో కూడా వారికి అక్కడ శిక్షణ ఇచ్చారు" అని కుమారస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో బెంగళూరు అభివృద్ధి ప్రాధికార సంస్థ (బీడీఏ)లో వివాదాస్పద రికార్డు ఉన్న వ్యక్తిని కేపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించారని ఆయన విమర్శించారు. సొంత శాఖలోని సమస్యలను పట్టించుకోకుండా, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే ఆర్‌ఎస్‌ఎస్‌పై విమర్శలు చేయడంపై ఆయన ఎద్దేవా చేశారు. ఈ స్కామ్ కేసులో ఐఏఎస్ అధికారి జ్ఞానేంద్ర కుమార్ అరెస్టు అయిన నేపథ్యంలో కుమారస్వామి విమర్శలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తక్షణమే రాహుల్ గాంధీ బెంగళూరుకు వచ్చి బాధితులతో ముఖాముఖి చర్చించాలని ఆయన సవాల్ విసిరారు.

# ఆ ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున సాయం

మొదటిపేజీ తరువాయి - ఆర్థిక సాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 27వ తేదీన చిలకలూరిపేట సమీపంలో ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుంది. విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఆటో నుజ్జునుజ్జయి, అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా చిలకలూరిపేట మండలం, వేలూరు గ్రామానికి చెందినవారని అధికారులు గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన ఎనిమిది మంది మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

# వెలిగొండపై మాటల యుద్ధం.. జగన్ కు లోకేశ్ కౌంటర్

మొదటిపేజీ తరువాయి - వెనుకబడిన ప్రాంతాల దశాబ్దాల కలను సాకారం చేసే వెలిగొండ ప్రాజెక్టు, ఇప్పుడు తెలుగుదేశం, వైసీపీల మధ్య తీవ్ర రాజకీయ వివాదానికి కేంద్రంగా మారింది. మంత్రి నారా లోకేశ్.. వైసీపీ అధినేత జగన్ ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు చేశారు. ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడం తెలిసిందే. నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో, "ఆ విజువల్స్‌ను దగ్గరగా చూడండి" అంటూ కొన్ని ఫోటోలను పోస్ట్ చేశారు. "2024లో వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారు. నీళ్లు లేని ఒక నీటిపారుదల ప్రాజెక్టును ప్రారంభించారు. ఇలాంటి ఫేక్ ప్రారంభోత్సవం వైసీపీకే సాధ్యం!" అని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వం 2024 మార్చిలో సొరంగాలు పూర్తి చేసిన సందర్భంగా నీటి ప్రవాహం లేకుండానే ప్రారంభోత్సవం జరిపిందని, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం నిజంగా నీటిని విడుదల చేసిందని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, జగన్ నిన్న ఒక సుదీర్ఘ పోస్ట్‌లో వెలిగొండ ప్రాజెక్టు ఘనత తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డిది, తన ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కీలకమైన సొరంగాల పనులను తమ ప్రభుత్వమే పూర్తి చేసిందని, టీడీపీ హయాంలో పనులు నెమ్మదిగా సాగాయని విమర్శించారు. ఈ పోస్టుకు కౌంటర్‌గానే లోకేశ్ తాజా విమర్శలు చేశారు. సోమవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించి, నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. తొలి విడతగా 10.7 టీఎంసీల నీటిని విడుదల చేయడంతో, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు చెందిన సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది.

# రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన

మొదటిపేజీ తరువాయి - రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ పర్యటన జరగనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో జగన్ పాల్గొననున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జగన్ పులివెందుల చేరుకుంటారు. అనంతరం భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఆ రోజు రాత్రికి పులివెందులలోని తన నివాసంలోనే బస చేస్తారు. ఇక సెప్టెంబర్ 2వ తేదీన ఉదయం పులివెందుల నివాసం నుంచి బయలుదేరి 7:45 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. అక్కడ వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తారు. వర్ధంతి కార్యక్రమం పూర్తయిన అనంతరం జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రతీ ఏటా వైఎస్సార్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలకు జగన్ హాజరై నివాళులు అర్పించడం తెలిసిందే.

# ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి - రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. వరద నీరు లేకున్నా, ఎటువంటి కేటాయింపులు లేకుండానే కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం వెలిగొండ ద్వారా నీటిని యథేచ్ఛగా తరలిస్తోందని హరీశ్ రావు ఆక్షేపించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు. ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ఏపీకి పరోక్షంగా సహకరించడమేనని ఆరోపించారు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సైతం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ వివాదంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపేలా చూడాలని, తద్వారా ఆయకట్టుకు నీరందించాలని కోరారు.

# భారతీయులకు ఉజ్బెకిస్థాన్ గుడ్ న్యూస్.. 30 రోజుల వీసా ఫ్రీ ప్రయాణం

మొదటిపేజీ తరువాయి - నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉజ్బెకిస్థాన్‌లో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీతో ఆ దేశ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ జరిపిన ఉన్నత స్థాయి చర్చల అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ప్రధాని మోదీతో భేటీ సందర్భంగా మిర్జియోయెవ్ మాట్లాడుతూ.. భారత్ తమకు 'నమ్మకమైన వ్యూహాత్మక భాగస్వామి' అని అభివర్ణించారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలు వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపారు. "గతేడాది తొలిసారిగా మన ద్వైపాక్షిక వాణిజ్యం 1 బిలియన్ డాలర్ల మార్కును దాటింది. గత కొన్నేళ్లుగా ఇరు దేశాల సంయుక్త సంస్థల సంఖ్య ఏడు రెట్లు పెరిగింది. ప్రస్తుతం భారత్, ఉజ్బెకిస్థాన్ మధ్య వారానికి 14 ప్రత్యక్ష విమాన సర్వీసులు నడుస్తున్నాయి" అని ఆయన వివరించారు. ఈ వీసా ఫ్రీ నిర్ణయంతో భారత పర్యాటకులు, వ్యాపారులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. కేవలం రాజకీయ, దౌత్యపరమైన సంబంధాలకే పరిమితం కాకుండా సాంస్కృతిక బంధాన్ని కూడా పటిష్ఠం చేసుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. తాష్కెంట్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి సెంటర్ ఫర్ ఇండియన్ కల్చర్, మహాత్మా గాంధీ సెంటర్ ఫర్ ఇండియన్ స్టడీస్ వంటి సంస్థలు సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి దోహదపడుతున్నాయని మిర్జియోయెవ్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఉజ్బెకిస్థాన్‌లో యోగాకు విశేష ఆదరణ లభిస్తోందని, 2018లోనే ప్రత్యేకంగా యోగా ఫెడరేషన్‌ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఉజ్బెకిస్థాన్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత 1992 మార్చి 18న భారత్‌తో దౌత్య సంబంధాలు ప్రారంభమయ్యాయి. 2011లో ఈ బంధం వ్యూహాత్మక భాగస్వామ్యంగా మారింది. ప్రధాని మోదీ 2015 తర్వాత ఉజ్బెకిస్థాన్‌లో పూర్తిస్థాయి ద్వైపాక్షిక పర్యటన చేపట్టడం ఇదే తొలిసారి. తన పర్యటన ముగించుకున్న అనంతరం మోదీ, కిర్గిజ్ అధ్యక్షుడు సాదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు 26వ షాంఘై సహకార సంస్థ (రాజూ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు బిష్కెక్‌కు చేరుకున్నారు.

# లారక్ ద్వీపంపై అమెరికా డ్రోన్ దాడులు



మొదటిపేజీ తరువాయి - అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్‌కు చెందిన లారక్ ద్వీపంపై అమెరికా సైనిక దళాలు దాడి చేశాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిలో ఇరాన్ సముద్రపు మైన్‌లను అమర్చేందుకు ప్రయత్నించడంతో ఈ దాడి చేసినట్లు అమెరికా ప్రకటించింది. ఈ ఘటనతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికార ప్రతినిధి టిమ్ హాకిన్స్ ఈ దాడిని ధ్రువీకరించారు. "ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) దళాలు.. హర్మూజ్ జలసంధిలోకి సముద్రపు మైన్‌లతో కూడిన రాకెట్లను ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నట్లు గుర్తించాం. ఈ ప్రాంతాన్ని నిశితంగా గమనిస్తున్నాం. వాణిజ్య నౌకల స్వేచ్ఛా రవాణాను పరిరక్షించడానికి సిద్ధంగా ఉన్నాం" అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దాడిలో రెండు ఇరానియన్ లాంచర్లను ధ్వంసం చేసినట్లు అమెరికా అధికారులు పేర్కొన్నారు. గత నెల రోజుల తర్వాత ఇరాన్ లక్ష్యాలపై అమెరికా దాడి చేయడం ఇదే తొలిసారి. ఈ దాడిని ఐఆర్‌జీసీ ధ్రువీకరించింది. ఇది 'అమెరికా-ఇజ్రాయెల్' ఉమ్మడి దాడి అని ఆరోపించింది. ఈ ఘటనలో పలువురు సైనిక సిబ్బంది, సాధారణ పౌరులు మరణించారని తెలిపింది. దాడికి పాల్పడిన వారికి కఠిన శిక్ష తప్పదని ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. అమెరికా డ్రోన్ దాడిలో కనీసం ఇద్దరు మరణించి, మరో ఇద్దరు గాయపడినట్లు ఇరాన్‌కు చెందిన అనధికారిక వార్తా సంస్థలు నివేదించాయి. ఇటీవల అమెరికా సైన్యం హర్మూజ్ జలసంధిలోని అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాల నుంచి సముద్రపు మైన్‌లను తొలగించింది. ఈ ఆపరేషన్ ముగిసిన కొద్ది రోజులకే ఇరాన్ మళ్లీ మైన్‌లను అమర్చేందుకు సిద్ధమవడంతో అమెరికా ఈ దాడికి దిగింది. సముద్రంలో మైన్‌లను అమర్చడంపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తున్నామని, అలాంటి ప్రయత్నాలకు పాల్పడే ఏ నౌకనైనా తక్షణమే ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలోనే ఇరాన్‌ను హెచ్చరించారు. తాజా ఘటనతో ఇరు దేశాల మధ్య వైరం మరింత ముదిరినట్లయింది.

# నేపాల్ విపత్తుకు కారణం ఇదే డ్రోన్ వీడియోలో రికార్డైన భయానక దృశ్యాలు!

మొదటిపేజీ తరువాయి - ఈ ఘటన కారణంగానే గత వారం నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో భీకర వరదలు సంభవించి వందలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. చైనాకు చెందిన ఒక ఫోటోగ్రాఫర్ సుమారు 7,200 మీటర్ల ఎత్తు నుంచి ఈ విపత్తును తన డ్రోన్ కెమెరాలో చిత్రీకరించారు. భారీ మంచు ఫలకం, రాళ్లతో కూడిన పర్వత భాగం ఒక్కసారిగా విరిగిపడటం, ఆ తర్వాత పర్వతాల నుంచి దట్టమైన ధూళి మేఘాలు పైకి లేవడం ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. విరిగిపడిన భాగం సుమారు 1,200 మీటర్ల దిగువన ఉన్న లోయలో పడటంతో మంచు, రాళ్లు, బురదతో కూడిన ఉప్పెన సృష్టించింది. ఈ ప్రళయం కారణంగా ఆగస్టు 26న భోటేకోశి, త్రిశూలి నదులు ఉగ్రరూపం దాల్చి భారీ విధ్వంసం సృష్టించాయి. ఈ వరదల వల్ల నేపాల్, టిబెట్ ప్రాంతాల్లో వందలాది మంది మరణించగా, వేలాది మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో ఎక్కువ మంది నేపాల్‌కు చెందినవారే. ఈ విపత్తు "ఊహకందనిది, హృదయ విదారకమైనది" అని నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఆవేదన వ్యక్తం చేశారు. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల వల్ల నష్టాన్ని అంచనా వేయడం సవాలుగా మారిందని ఆయన తెలిపారు. శాటిలైట్ చిత్రాలు, భూకంప డేటాను విశ్లేషించిన శాస్త్రవేత్తలు... లాంగ్‌టాంగ్ లిరుంగ్ ఉత్తర భాగంలో భారీ స్థాయిలో మంచు, రాళ్లు విరిగిపడటమే వరదలకు కారణమని తేల్చారు. హిమానీనదం కూలినప్పుడు భూకంప లేఖినిపై 5.2 తీవ్రతతో ప్రకంపనలు నమోదయ్యాయని వెల్లడించారు. హిమాలయాల్లో ఇలాంటి విపత్తులు ఇటీవలి కాలంలో తరచుగా జరుగుతున్నాయని, ఎత్తైన ప్రదేశాల్లోని అస్థిరమైన మంచు, రాళ్ల వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారి కోసం అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

# 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'

మొదటిపేజీ తరువాయి - కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. "నాతో ఎందుకు ఇలా చేయాలి?" అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. నిజామాబాద్‌లో నిర్వహించిన తన పార్టీ పాంచజన్య సభలో కవిత మాట్లాడారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన ఆమె.. బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదన్నారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పారు. కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు "కవిత సీఎం.. సీఎం" అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పారు. అందుకే కొత్త పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని చెప్పారు. ఏ తప్పూ చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు.

# పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి ఫైర్



మొదటిపేజీ తరువాయి - తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట - మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై నూతనంగా నిర్మించిన వంతెనను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్ల పాలనలో సాధ్యం కాని పనులను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే పూర్తి చేసి చూపిందని పేర్కొన్నారు. వర్షం వస్తే మునిగిపోయే పాత వంతెన స్థానంలో నూతన వంతెనను నిర్మించాలని పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు ఆలోచించలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో సరైన ప్రభుత్వ కార్యాలయాలు లేవని, స్థానిక ప్రజల సౌకర్యార్థం ఇక్కడ ప్రభుత్వ భవనాలను నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా, 10 ఎకరాల స్థలంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని ప్రకటించారు. బతుకమ్మ కుంట కబ్జాకు పాల్పడుతున్న వారి వెనుక ఎవరి హస్తముందో ప్రజలు గమనించాలని ఆయన కోరారు. తాము బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, కనీసం ఏడో తేదీ వచ్చినా ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని దయనీయ స్థితి నెలకొని ఉండేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలించిన 16 మంది ముఖ్యమంత్రులు కలిసి కేవలం రూ. 70 వేల కోట్లు అప్పు చేస్తే, కేసీఆర్ ఒక్కరే తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. తమ ప్రభుత్వం చెరువులను కబ్జా చేసి విల్లాలు, ఫామ్‌హౌస్‌లు నిర్మించడం లేదని, కేవలం ఆక్రమణలను తొలగించి జలవనరులను కాపాడుతోందని స్పష్టం చేశారు. గతంలో తనను విమర్శించిన ఉద్యోగులే ఇప్పుడు తమ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ప్రస్తుతం ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల పనితీరును బేరీజు వేసుకోవాలని ఆయన ఉద్యోగులను కోరారు. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

# వెనెజువెలాతో అమెరికా చారిత్రాత్మక ఆయిల్ డీల్



మొదటిపేజీ తరువాయి - నియంత్రణలోకి తీసుకుంటుందని వెల్లడించారు. "ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద చమురు ఒప్పందం"గా దీనిని ఆయన అభివర్ణించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ఒప్పందం సాకారమైందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. అమెరికాలో గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో ఈ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ఆరు నెలలుగా కొనసాగుతుండటంతో, హర్మూజ్ జలసంధి గుండా చమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అమెరికాలో గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం గ్యాలన్ గ్యాస్ ధర 4.09 డాలర్లుగా ఉండగా, గత ఏడాది ఇదే సమయానికి అది 3.21 డాలర్లుగా ఉండేది. దీంతో అమెరికా తన వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను వాడాల్సి వచ్చింది. ఈ నిల్వలు 2026 ప్రారంభం నుంచి 100 మిలియన్ బ్యారెళ్లకు పైగా తగ్గి, 300 మిలియన్ బ్యారెళ్ల దిగువకు పడిపోయాయి. సుమారు 9 నెలల క్రితం అమెరికా సైన్యం వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలపై విచారణ కోసం అమెరికాకు తరలించింది. అనంతరం తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్, దేశ చమురు రంగాన్ని ప్రైవేటీకరణకు అనుమతిస్తూ చట్టం చేశారు. దశాబ్దాల సోషలిస్ట్ పాలనకు ఇది పూర్తి విరుద్ధం. ఈ మార్పే తాజా ఒప్పందానికి మార్గం సుగమం చేసింది. ఈ ఒప్పందం ద్వారా వెనెజువెలాలోకి 100 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులు వస్తాయని, అమెరికాలో గ్యాస్ ధరలు తగ్గుతాయని మార్కో రూబియో 'ఎక్స్'లో పేర్కొన్నారు. అయితే, దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన మౌలిక సదుపాయాల కారణంగా వెనెజువెలాలో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికన్ ఆయిల్ కంపెనీలు ఎంతవరకు ముందుకొస్తాయనేది వేచి చూడాలి. గతంలో ఎక్సాన్‌మొబిల్ సీఈఓ డారెన్ వుడ్స్, వెనెజువెలాను 'పెట్టుబడులకు అనర్హమైన దేశం'గా అభివర్ణించారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలు (సుమారు 303 బిలియన్ బ్యారెళ్లు) ఉన్నప్పటికీ, మౌలిక సదుపాయాల కొరతతో వెనెజువెలా ప్రస్తుతం ప్రపంచ ఉత్పత్తిలో కేవలం 1% మాత్రమే ఉత్పత్తి చేస్తోంది.

నిజం దృష్టి తెలుగు న్యూస్

మంగళవారం 01-09-2026

# తక్కువ బడ్జెట్‌తో నాణ్యమైన ఇంటీరియర్ సేవలను అందించానే ఆలోచన అభినందనీయం

ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి

బడ్జెట్ ఫ్రెండ్లీ ఇంటీరియర్ ఆఫీస్ ప్రారంభోత్సవం

ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్



**నిజం న్యూస్ ప్రతినిధి షాద్ నగర్, ఆగస్టు 31 :** పట్టణంలో అయ్యప్ప కాలనీలో మహేష్ బండ ఏర్పాటు చేసిన బడ్జెట్ ఫ్రెండ్లీ ఇంటీరియర్ ఆఫీస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి కాలంలో ఇళ్లు, కార్యాలయాలకు అందమైన ఇంటీరియర్ డిజైనింగ్ అనేది ఒక ముఖ్యమైన అవసరంగా మారిందని పేర్కొన్నారు. సామాన్యులకు,మధ్యతరగతి వర్గాలకు సైతం అందుబాటులో ఉండేలా తక్కువ బడ్జెట్‌తో నాణ్యమైన ఇంటీరియర్ సేవలను అందించేందుకు ఇలాంటి ఆఫీస్‌లను ప్రారంభించడం అభినందనీయమన్నారు. స్థానిక యువత ఇటువంటి సరికొత్త వ్యాపార రంగాల్లోకి అడుగుపెట్టడం సంతోషకరమని, నూతన కార్యాలయ నిర్వాహకులకు ఆయన తన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్ కౌన్సిలర్ బిఎస్ సుధీర్, అనిత రఘునాథ్ యాదవ్,మాజీ కౌన్సిలర్లు చింటూ ప్రతాపరెడ్డి,ఈశ్వర్ రాజు,నందకిషోర్,మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ,ఎస్సీ,ఎస్టీ, ధర్మ సమాజ్ పార్టీ, జిల్లా నాయకులు అదనపుజిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందజేత

14 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థులకు అందించి ఆదుకోవాలి...

బీసీ,ఎస్సీ, ఎస్టి,జేఏసీ నాయకుల డిమాండ్...






మెండోరా మండల **ఆగస్టు 31 నిజం న్యూస్:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో బీసీ.ఎస్సీ. ఎస్టీ. జేఏసీ.జిల్లా కన్వీనర కోటగిరి రామా గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు వడ్ల బాలయ్య, ప్రేమ్ కుమార్, పలువురు బిసి. ఎస్సీ.ఎస్టీ. జేఏసీ. ధర్మ సమాజ్ పార్టీ నాయకులు అదనపు కలెక్టర్ భుజంగరావుకు బుధవారం రోజున డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం బీసీ ఎస్సీ. ఎస్టీ. ధర్మ సమాజ్ పార్టీ, జేఏసీ. కన్వీనర్ తాళ్లరాంపూర్ మాజీ సర్పంచ్ కోటగిరి రామ గౌడ్, జిల్లా బీసీ. ఎస్సీ. ఎస్టీ.జేఏసీ. జిల్లా నాయకులు ప్రేమ్ కుమార్, వడ్ల బాలయ్య, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు పలువురు విలేకరుల తో మాట్లాడారు. జిల్లా జేఏసీ కన్వీనర్ కోటగిరి రామా గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కండెల సుమన్, జిల్లా నాయకులు ప్రేమ్ కుమార్, వడ్ల బాలయ్యమాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు దాదాపు 14 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ నిధులను ప్రభుత్వం పెండింగ్లో ఉంచడం వల్ల, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ అందించకపోవడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు నాన ఇబ్బందులకు గురవుతున్నారని వారు అన్నారు.ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్లో ఉంచడం వల్ల,ఈ ఫీజులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఎంతోమంది విద్యార్థులు తమ ఫీజులను ప్రభుత్వం అందించకపోవడంతో,దుస్థితి కొట్టుమిట్టాడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ముఖ్యంగా బీసీ. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కళాశాలలో తమ చదువులను కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను, విద్యార్థుల తల్లిదండ్రులు మానసికంగా గురవుతున్న సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని,ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఆలస్యం కావడం వల్ల విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలిగి మధ్యలోనే చదువులు నిలిపివేసిన పరిస్థితి నెలకొందన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ ప్రభుత్వం సకాలంలో అందించకపోవడం, జాప్యం చేయడం వల్ల కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు అనివారు ఆరోపించారు. ఫీజు రియంబర్స్మెంట్ ప్రభావం ఒక కోటి కుటుంబాలపై, విద్యార్థులపై,విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పడడమే కాకుండా ఆత్మహత్యల కు కారణం అవుతుందని, ఇంతటి దుర్భర పరిస్థితిని బీసీ.ఎస్సీ. ఎస్టీ.పేద విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు అని వారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న ఈ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులు, ఎటువంటి ఆటంకం లేకుండా తమ విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాము అని తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీ.ఎస్సీ. ఎస్టీ,బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోకపోతే, అన్ని జిల్లాల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ. ఎస్సీ.ఎస్టీ. ధర్మ సమాజ్ పార్టీఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని బీసీ. ఎస్సీ. ఎస్టీ.జేఏసీ. జిల్లాకన్వీనర్ కోటగిరి రామా గౌడ్, రాష్ట్ర,జిల్లా నాయకులు కండెల సుమన్, జిల్లా నాయకులు ప్రేమ్ కుమార్, వడ్ల బాలయ్య, ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు పలువురు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ, జిల్లా నాయకులు ప్రేమ్ కుమార్,బాలయ్య చారి, రఘురామ్, ముదిరాజ్,సుదర్శన్, రాజు, నలిని కాంత్, సాగర్ చారి,గంగారం రజక, ధర్మ సమాజ్ పార్టీ, జిల్లా నాయకులు ప్రశాంత్, రమేష్,కిరణ్, మహిపాల్,మురళి,భుమేష్,మహేష్,భాస్కర్, ధర్మ సమాజ్ పార్టీ జేఏసీ, ముఖ్య నాయకులు, పలువురు, పాల్గొన్నారు.

# సెక్రటేరియట్ పై ముట్టడి చేసిన మాలమహానాడు నాయకులు






**ఉమ్మడి నల్లగొండ జిల్లా (నిజం న్యూస్ రిపోర్టర్) భూతం శ్రీకాంత్ ఆగస్టు 31:** ఈరోజు తెలంగాణ స్టేట్ రాష్ట్ర ఆధ్వర్యంలో మాలలకు జరుగుతున్న రోస్టర్ పాయింట్ ను సరి చేయాలని రాష్ట్ర మాల సంఘాల నాయకులు, జాతీయ మాల మహానాడు పిలుపుతో సెక్రటేరియట్ ముట్టడి రోస్టర్ పాయింట్ ను సరి చేయాలని చేయని యెడల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదుర్కొని రోస్టర్ పాయింట్ సరి చేయని యెడల ధర్నాలు, రాస్తారోకోలు, దీక్షలు, ఒక సంవత్సరం నుండి మాలలు చేస్తూనే ఉన్నారు, గంటల రేణుక కరీంనగర్ జై తెలంగాణ మాల మహానాడు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదాద్రి భువనగిరి జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు పెరమండ్ల యాదగిరి,ఆధ్వర్యంలో అలాగే యాదాద్రి భువనగిరి జిల్లారామన్నపేట, మండలం,మాలమహానాడు యువ నాయకుడు భూతం శ్రీకాంత్, రిపోర్టర్,రోస్టర్ పాయింట్ సరిచేయని యెడల డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మాల కులానికి చెందిన మంత్రి, స్పీకర్, మాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇండ్లు ముట్టడించే కార్యక్రమం మొదలు చేస్తాం, సీఎం రేవంత్ రెడ్డి జాతీయ లేవల్ల మాలలు కాంగ్రెస్ పార్టీలో సేవలు చేస్తున్నారు, కానీ మాలలకు అన్యాయం చేస్తున్నావు, దీన్ని ఇంతటితో సరి చేయకపోతే కాంగ్రెస్ పార్టీ గద్దె దించడం ఖాయం, మాలల పంతం, కాంగ్రెస్ అంతం, జై భీమ్, జై మాల.

# సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి

డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు



వనపర్తి బ్యూరో **ఆగస్టు 31 నిజం న్యూస్:** ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్లలో అత్యవసర వైద్య సేవలు పొందిన పేదలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం సహాయనిధి రూ.45,31,100/- రూపాయల విలువైన 150 చెక్కులను తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. చిన్నా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఏర్పడి రేపటికి సెప్టెంబర్ ఒకటి నాటికి విజయవంతంగా వెయ్యి రోజుల మైలురాయిని చేరుకుంటుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను పాలనకు కేంద్ర బిందువుగా చేసుకొని సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తూ వెయ్యి రోజుల పరిపాలన తెలంగాణ ప్రగతిలో కొత్త అధ్యాయన్ని నమోదు చేసుకుంటుందని అన్నారు.ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి పేద వారికి అందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పనిచేయాలని కోరారు. గత ప్రభుత్వ అప్పులను తీరుస్తూనే,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రికార్డు స్థాయిలో సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తున్నామని అన్నారు. పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ లేనివారికి చికిత్స అనంతరం సహాయనిధి ద్వారా కొంత ఆర్థిక ఉపశమనం కల్పిస్తున్నామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను గుర్తించి సంక్షేమానికి కృషి చేస్తుందని అన్నారు.సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సహాయం పేదోళ్ల ఆరోగ్యానికి కొండంత ఆసరాగా నిలుస్తుందని అన్నారు. వనపర్తి నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా మానవతా ధృక్పథంతో అందరికీ చెక్కులను అందజేస్తు న్నామని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందుకున్న లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి కి, డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, రాష్ట్ర మైనార్టీ నాయకులు అక్తర్,వనపర్తి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, సోషల్ మీడియా కోకో ఆర్డినేటర్ చంద్రశేఖర్, వనపర్తి జిల్లా ఏఐపిసి అధ్యక్షులు నాగార్జున,వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ బాబా, వనపర్తి మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆవుల చంద్రశేఖర్ , పెబ్బేర్ మండల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అనిల్, అయ్యవారిపల్లె సర్పంచ్ కురుమన్న,సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, సహదేవుడు, మన్యం యాదవ్, రాముడు, హరిబాబు రెడ్డి, ఇమ్రాన్, శ్రీధర్, వెంకటేష్ సాగర్, ఆనంద్ సాగర్, శివ నారాయణ, చెన్నయ్య, వెంకటేష్, నాగన్న గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ గౌడ్, నరసింహ, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

మాజీ మేయర్ అజయ్ యాదవ్



**నిజం న్యూస్ ప్రతినిధి,బోడుప్పల్, ఆగస్టు 31 :** బోడుప్పల్, పోచారం సర్కిళ్ల పరిధిలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ఐఏఎస్ తో సమావేశమై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, పోచారం డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ శిఖర ప్రతిష్టాపనలో ఏనుగు సుదర్శన్ రెడ్డి

భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన సాయి ప్రియ నగర్ కాలనీ వేడుకలు



**నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి, ఆగస్టు 31 :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి 9వ డివిజన్ సాయి ప్రియ నగర్ కాలనీలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ శిఖర ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సాయి ప్రియ యూత్ అసోసియేషన్, కాలనీ వాసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక వేడుకలకు మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, అమ్మవారి కృప ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి అధ్యక్షుడు జమ్మల ప్రభాకర్ రెడ్డి,యువ మోర్చా నాయకులు బండారు పవన్ రెడ్డి, కనేబోయిన రాము యాదవ్,జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు బాల్రాజ్ గౌడ్,రంజిత్,స్వామి యాదవ్,సతీష్,వంశీ,పవన్,ప్రధాన కార్యదర్శి బాల్ రెడ్డి,హరీష్ యాదవ్,సాయి ప్రియ యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల సమస్యలపై ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) చొరవ




**నిజం న్యూస్ ప్రతినిధి, ఉప్పల్, ఆగస్టు 31 :** ఉప్పల్ బీరప్పగడ్డ డివిజన్ -- ఇందిరానగర్ కాలనీ వాటర్ ప్లాంట్ సమీపంలో పైప్‌లైన్ పనుల కోసం రోడ్డును తవ్విన అనంతరం సరైన రీతిలో పునరుద్ధరించకపోవడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అసమానమైన రోడ్డు కారణంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. ప్రజల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అక్కడ కొత్త సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అదేవిధంగా పిస్తా హౌస్ నుంచి ఉప్పల్ మండే మార్కెట్, టిఎస్ఎస్ పిడీసీఎల్ కార్యాలయం సమీపంలోని రహదారి కూడా ఉప్పల్ ప్రధాన రహదారి డైవర్షన్ కారణంగా భారీగా వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డు తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ రహదారిని కూడా కొత్తగా అభివృద్ధి చేసి ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలని కోరారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ఐఏఎస్ వినతిపత్రం సమర్పించారు. రాధిక గుప్తా ఐఏఎస్ సానుకూలంగా స్పందించి ప్రజల సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదే సమయంలో పనుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు వెంటనే ఫైల్‌ను ప్రాసెస్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ సెక్రటరీ సందీప్ భూషణ్, గఫూర్ భాయ్, పాండరినాథ్, రిజ్వాన్ భాయ్, రాజు, బాబా భాయ్, కిరణ బాషా భాయ్, ఆజాద్, నాగయ్య, వాటర్ ప్లాంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. “ప్రజల సమస్యే నా సమస్య” అనే నినాదంతో బీరప్పగడ్డ డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) తెలిపారు.

# యువత స్వయం ఉపాధిలో రాణించాలి

నలుగురికి ఉపాధి అవకాశాలు చేయించాలి

మాజీ మంత్రివర్యులు డాక్టర్ లక్ష్మారెడ్డి.

లక్ష్మారెడ్డి చేతుల మీదుగా బడ్జెట్ ఫ్రెండ్లీ ఇంటీరియర్ ఆఫీస్ ప్రారంభోత్సవం



**నిజం న్యూస్ ప్రతినిధి షాద్ నగర్, ఆగస్టు 31:** యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించి నలుగురికి ఉపాధి అవకాశాలు చూయించే స్థాయిలో ఉండాలని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు డాక్టర్ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఈమేరకు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో అయ్యప్ప కాలనీలో మహేష్ బండ ఏర్పాటు చేసిన బడ్జెట్ ఫ్రెండ్లీ ఇంటీరియర్ ఆఫీస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ... నేటి కాలంలో ఇళ్లు, కార్యాలయాలకు అందమైన ఇంటీరియర్ డిజైనింగ్ అనేది ఒక ముఖ్యమైన అవసరంగా మారిందని పేర్కొన్నారు. సామాన్యులకు, మధ్యతరగతి వర్గాలకు సైతం అందుబాటులో ఉండేలా తక్కువ బడ్జెట్‌తో నాణ్యమైన ఇంటీరియర్ సేవలను అందించేందుకు ఇలాంటి ఆఫీస్‌లను ప్రారంభించడం అభినందనీయమన్నారు. స్థానిక యువత ఇటువంటి సరికొత్త వ్యాపార రంగాల్లోకి అడుగుపెట్టడం సంతోషకరమని, నూతన కార్యాలయ నిర్వాహకులకు ఆయన తన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, షాప్ నిర్వాహకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు సమాజానికి చిరస్మరణీయం

మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి

పాపిరెడ్డిగూడ హైస్కూల్ హెచ్ఎం కోప్పునూరి శ్రీశైలం పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం



**నిజం న్యూస్ ప్రతినిధి షాద్ నగర్, ఆగస్టు 31 :** పాపిరెడ్డిగూడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోప్పునూరి శ్రీశైలం పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హాజరై పదవీ విరమణ చేస్తున్న హెచ్ఎం శ్రీశైలంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఒక ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా శ్రీశైలం అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. పదవీ విరమణ అనేది సేవలకు ముగింపు కాదని, జీవితంలో మరో కొత్త అధ్యాయానికి ప్రారంభమని పేర్కొంటూ, శ్రీశైలం గారు భవిష్యత్తులో మరింత సంతోషంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శశిరేఖ యాదయ్య, మహిళా అధ్యక్షురాలు రాణి, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయులు కోప్పునూరి శ్రీశైలంకు శుభాకాంక్షలు తెలిపారు.

# బోనస్ బోగసేనా?



రైతు కంటనీరు ప్రభుత్వానికి మంచిది కాదు. అబద్ధాలతో, ఆచరణసాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన ఏడాదిన్నరలో అన్ని వర్గాల ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేసింది. అనవసరపు ఆడంబరాలు, అక్కరకురాని డాంబికాలు ప్రదర్శించడం తప్ప కాంగ్రెస్ సర్కారు పనితనం ఎక్కడా కానరాలేదు. ముఖ్యంగా రాష్ట్ర రైతాంగం దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఎన్నికల ముందు వరంగల్ రైతుడిక్లరేషన్ పేరిట అన్నదాతలకు అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నేడు వాటన్నింటికి తిలోదకాలిచ్చింది. బీఆర్ఎస్ సర్కారు సాగునీరు, రైతుబంధు, నిరంతర ఉచిత విద్యుత్తు వంటి పథకాలు అమలు చేయడంతోపాటు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, సకాలంలో ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడంతో వ్యవసాయ స్థిరీకరణ జరిగింది. తద్వారా వ్యవసాయరంగం వృద్ధి చెంది రైతుల ఆదాయం పెరిగింది. రాష్ట్ర రైతాంగం పదేండ్లపాటు సుభిక్షంగా ఉన్నది. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. రైతులకు గడ్డుకాలం వచ్చింది. ఇప్పుడు రాష్ట్రంలో ఎటుచూసినా అన్నదాతల ఆక్రందనలే వినిపిస్తున్నాయి. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట రాహుల్‌గాంధీ సమక్షంలో అన్నదాతలపై వరాల జల్లును కాంగ్రెస్ కురిపించింది. వాటిలో ముఖ్యమైనది వడ్లకు బోనస్. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ రైతులను నమ్మించి ఓట్లు వేయించుకున్నది. తీరా అధికారంలోకి వచ్చాక సన్నరకం ధాన్యానికే ఇస్తామని కాంగ్రెస్ పాలకులు మాట మార్చేసి దగా చేశారు. ఈ యాసంగి సీజన్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసి నెల రోజులు గడుస్తున్నా, రైతులకు ఇంకా ఒక్క రూపాయి కూడా బోనస్ అందకపోవడం శోచనీయం. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం 18 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా సన్నధాన్యం కొనుగోలు చేయగా, సుమారు రూ.1000 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉన్నది. గత సీజన్‌లో రైతులు అధిక మొత్తంలో సన్నాలు సాగు చేశారు. కానీ, గత సీజన్‌లో బోనస్ చెల్లింపులో ఆలస్యం జరగడం, చాలామంది రైతులకు బోనస్ రాకపోవడంతో ఈ సీజన్‌లో దొడ్డు వడ్ల సాగు వైపు అన్నదాతలు మొగ్గుచూపారు. బోనస్ వస్తుందనే ఆశతో సన్నాలు సాగు చేసిన అన్నదాతలకు ఇప్పుడు కూడా భంగపాటు తప్పడం లేదు. మరోవైపు రుణమాఫీ విషయంలోనూ రైతులను కాంగ్రెస్ దగా చేసింది. రుణమాఫీ కాలేదని ఎంతోమంది రైతులు ఇప్పటికీ అధికారులు, బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. రైతుబంధు పేరును రైతు భరోసాగా మార్చడంలో చూపిన ఉత్సాహాన్ని దాని అమలులో మాత్రం కాంగ్రెస్ సర్కారు చూపడం లేదు. ఎకరానికి రూ.7,500కు బదులు మాట తప్పి ఇస్తామన్న రూ.6 వేలు కూడా ఇప్పుడు అందడం లేదు. పెట్టుబడిసాయం ఎగవేయడంతో అన్నదాతలు అప్పులపాలవుతున్నారు. మరోవైపు అకాల వర్షం, వడగండ్ల వాన కారణంగా నష్టపోయిన అన్నదాతలకు నష్టపరిహారం అందడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన సుమారు 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలి. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్ ఇవ్వాలి. లేకపోతే రాబోయే రోజుల్లో లక్షలాది మంది రైతులు పోరుబాట పట్టడం ఖాయం.

## వర్షాకాలంలో బొప్పాయి పండ్లను తప్పనిసరిగా తినాల్సిందే.. ఎందుకో తెలుసా..?

బొప్పాయి పండ్లు మనకు దాదాపుగా ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. కానీ బొప్పాయి పండ్లను మనం వర్షాకాలంలో ఎక్కువగా తినాల్సి ఉంటుంది. బొప్పాయి పండ్లను తినడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి. వర్షాకాలంలో ఈ పండ్లను తినాలా, వద్దా అని చాలా మంది సందేహిస్తుంటారు. కానీ ఈ పండ్లను ఈ సీజన్‌లోనే కచ్చితంగా తినాలని వైద్యులు సూచిస్తున్నారు. బొప్పాయి పండ్లలో అనేక ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. బొప్పాయి పండ్లలో పపైన్, కైమో పపైన్ అనే ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి జీర్ణ రసాలు ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. మనం తిన్న ఆహారంలో ఉండే ప్రోటీన్లు, కొవ్వులను జీర్ణం చేయడంలో ఇవి సహాయం చేస్తాయి. వర్షాకాలంలో మన జీర్ణ వ్యవస్థ పనితీరు మందగిస్తుంది. కానీ బొప్పాయి పండ్లను తింటే జీర్ణ వ్యవస్థను యాక్టివ్‌గా ఉండేలా చేయవచ్చు. దీంతో ఆహారం సులభంగా జీర్ణం అవడమే కాదు, గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం, మలబద్దకం వంటి సమస్యలు తగ్గుతాయి.



**ఇన్ఫెక్షన్లకు చెక్..**

వర్షాకాలంలో ఫుడ్ పాయిజనింగ్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కానీ బొప్పాయి పండును తింటే ఫుడ్ పాయిజనింగ్‌ను నివారిస్తుంది. ఇందుకు కారణం అయ్యే బ్యాక్టీరియా, ఇతర క్రిములను నాశనం చేసే గుణాలు బొప్పాయి పండ్లలో ఉంటాయి. ఈ పండ్లను తింటే విరేచనాలు తగ్గుతాయి. పొట్టలో ఉండే నులి పురుగులు సైతం నశిస్తాయి. మలబద్దకం ఉన్నవారు బొప్పాయి పండ్లను తింటుంటే ఫలితం ఉంటుంది. విరేచనం సాఫీగా అవుతుంది. పేగుల్లో ఉండే మలం పూర్తిగా బయటకు వస్తుంది. బొప్పాయి పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. విటమిన్ ఎ, విటమిన్ ఇ, ఫ్లేవనాయిడ్స్ తదితర యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఈ పండులో అధికంగా ఉంటాయి. ఇవి వర్షాకాలంలో సహజంగానే మనకు వచ్చే ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో సహాయం చేస్తాయి. ఈ సీజన్‌లో వచ్చే ఫ్లూ, దగ్గు, జలుబు వంటి ఇన్‌ఫెక్షన్లను తగ్గేలా చేస్తాయి. ఈ పండులోని విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని పెంచి వ్యాధులను తగ్గేలా చేస్తాయి. కనుక ఈ సీజన్‌లో బొప్పాయి పండ్లను విడిచిపెట్టకుండా తినాలని వైద్యులు సూచిస్తున్నారు.

**నొప్పులు, వాపులకు..**

బొప్పాయి పండ్లను తినడం వల్ల శరీరంలోని వాపులు, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ పండ్లలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. ఆర్థరైటిస్ నొప్పులు ఉన్నవారికి బొప్పాయి పండ్లు ఎంతగానో మేలు చేస్తాయి. బొప్పాయి పండ్లలో ఉండే విటమిన్లు ఎ, సి, ఇ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయం చేస్తాయి. వర్షాకాలం కారణంగా గాలిలో తేమ అధికంగా ఉంటుంది. దీంతో చర్మం డల్‌గా మారుతుంది. కొందరికి దురదలు వచ్చే అవకాశాలు ఉంటాయి. అలాంటి వారు బొప్పాయి పండ్లను తింటుండాలి. లేదా వీటిని గుజ్జుగా చేసి ఫేస్ ప్యాక్‌లా కూడా ఉపయోగించవచ్చు. బొప్పాయి పండు ఫేస్ ప్యాక్‌ను వాడితే ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. మొటిమలు, మచ్చలు సైతం పోతాయి.

**బరువు తగ్గేందుకు..**

వర్షాకాలంలో తలెత్తే విరేచనాల సమస్య వంటి వాటి కారణంగా కొందరికి శరీరంలో ద్రవాలు త్వరగా బయటకు పోతాయి. అలాంటి వారు బొప్పాయి పండ్లను తింటుంటే ఫలితం ఉంటుంది. ఈ పండ్లలో ఉండే ఎంజైమ్‌లు జీవక్రియలను సరిగ్గా నిర్వహించడంలో సహాయం చేస్తాయి. దీంతో క్యాలరీలు సులభంగా ఖర్చవుతాయి. బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనే డైట్‌లో ఉన్నవారు బొప్పాయి పండ్లను రోజూ తింటుంటే ఫలితం ఉంటుంది. ఈ పండ్లలో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది. కళ్లను రక్షిస్తుంది. వయస్సు మీద పడడం వల్ల వచ్చే శుక్లాల సమస్య రాకుండా చూస్తుంది. బొప్పాయి పండ్ల గ్లైసీమిక్ ఇండెక్స్ (జీఐ) విలువ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల షుగర్ ఉన్నవారు ఈ పండ్లను తిన్నా షుగర్ లెవల్స్ పెరగవు. పైగా ఈ పండ్లలో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ పండ్లను తింటే ఎంతో మేలు జరుగుతుంది. ఇలా బొప్పాయి పండ్లను వర్షాకాలంలో ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

## పర్వతపు అంచున పట్టాల పరుగు వెనుక..!



ఒక అత్యున్నత నిర్మాణం వెనుక తప్పకుండా ఒక అత్యుత్తమ కృషి ఉంటుంది. జమ్మూ- శ్రీనగర్‌లను అనుసంధానించేందుకు నిర్మించిన భూమి మీది అత్యంత ఎత్తయిన చీనాబ్ రైల్వే వంతెన వెనుక కూడా అలాంటి కష్టమే ఉంది. ప్రపంచాన్ని అబ్బురపరిచే ఈ నిర్మాణంలో తెలుగు వనిత డా? గాలి మాధవీలత పదిహేడేండ్ల శ్రమ దాగుంది. నేలకు వేల అడుగుల ఎత్తున పట్టాలు పెట్టించడానికి ఆమె బృందం ఎన్నుకున్న టెక్నిక్.. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలోనే సరికొత్త మార్గంగా మారింది. అసాధ్యమనిపించే పనిని సుసాధ్యం చేసి చూపిస్తే అది చేసిన వారికే కాదు, చూసిన వారికీ ఆనందాన్ని కలిగిస్తుంది. హిమాలయ సానువుల్లో చీనాబ్ వంతెన మీదుగా రైలు ప్రయాణం చేసేవారు తప్పకుండా ఈ ఆనందానుభూతిని పొందుతారు. శత్రుదుర్భేద్యం అనదగిన కొండలను తొలిచి భారత్‌లోనే తొట్ట తొలిసారిగా నిర్మించిన స్టీల్ ఆర్క్ బ్రిడ్జ్ అది. చీనాబ్ నదీ పాయకు 1200 అడుగుల ఎత్తున, 4300 అడుగుల పొడవుతో దీన్ని నిర్మించారు. అయితే సాధారణంగా ఇప్పటిదాకా భారత్‌లో జరిగిన బ్రిడ్జిల నిర్మాణానికీ దీనికీ చాలా తేడా ఉంది. ఆకాశానికీ నేలకూ మధ్య దీన్ని నిర్మించాలంటే పర్వతాలు, రాళ్ల వాటి స్వభావాల్లాంటి అనేక విషయాల మీద లోతైన అవగాహన అవసరం. అందుకే ఐఐటీలో చదువుకుని, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి రాక్ మెకానిక్స్‌లో పోస్ట్ డాక్టోరల్‌షిప్ చేసిన డా? మాధవీలత వంతెన నిర్మాణంలో కీలకంగా వ్యవహరించగలిగారు. ఈ ప్రాజెక్టులో కన్సల్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించారామె. ఆమెది ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఏడుగుండ్లపాడు.

**డిజైన్ యాజ్ యూ గో..**

పని ముందుకు వెళ్తున్న దాన్నిబట్టి వంతెనను డిజైన్ చేస్తూ పోవడమే అని చెప్పేదే మాధవీలత బృందం ఎంచుకున్న డిజైన్ యాజ్ యూ గో టెక్నిక్. మిగతా నిర్మాణాలు వాటి ప్రణాళికలకు దీనికీ అసలైన భేదం ఇక్కడే ఉంది. నేల స్వభావం, గట్టిదనం, నీరు పారే వేగం, దిశలాంటి వివిధ అంశాలను బట్టి సాధారణంగా ఇంజినీర్లు వంతెనల నిర్మాణానికి ప్లాన్ గీస్తుంటారు. అయితే ఇక్కడ పరిస్థితి వేరు. దీని గురించి మాధవీలత ఇండియన్ జియోటెక్నికల్ జర్నల్‌లో రాసిన అనుభవాల ప్రకారం%?% ఆ పర్వతాల మీద విభిన్నమైన రాళ్లు ఉన్నాయి. ముందుగా వాటి స్వభావాన్ని తెలుసుకోవాల్సి వచ్చింది. వాటి పటిష్టత కూడా పెద్ద అంశమే. దాని ఆధారంగానే స్టీలు యాంకర్లు వేయాల్సి ఉంటుంది. అయితే కొండల అంచున వేర్వేరు రాళ్లే కాదు, వాటిలో పెద్ద పెద్ద ఖాళీలు కూడా ఉన్నాయి. కాబట్టి వంతెనను నిలబెట్టడానికి ముందు వాటిని కాంక్రీట్‌తో నింపాల్సి వచ్చింది. మరో విషయం ఏంటంటే అంత ఎత్తున గాలి కూడా విపరీతమైన వేగంతో వస్తుంది. నిరంతరం అలాంటి గాలులకు వంతెన తట్టుకోవాలి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ఏ ప్రదేశంలో పనిచేస్తున్నాం, అక్కడి పరిస్థితులేంటి అన్నదాన్నిబట్టే వంతెనను డిజైన్ చేసుకుంటూ ముందుకు వెళ్లాం. నిర్దిష్టమైన ప్లాన్ పెట్టుకుని అలాగే వెళ్లాలంటే ఇక్కడ కుదరదు. అందుకే ఈ వంతెన రూపకల్పన (డిజైనింగ్) విషయంలో పనితోపాటు మార్పులు చేసుకునే పద్ధతినే అనుసరించారు. మరో విషయం ఏమిటంటే ఏకంగా రిక్టర్‌స్కేలు మీద 8 తీవ్రతలో ఇక్కడ భూకంపాలు వచ్చే అవకాశాలు ఎక్కువ. -20 డిగ్రీల అతి తక్కువ ఉష్ణోగ్రతలు%?% ఇవి కాక ఈ ప్రాంతంలో టెర్రరిస్టులు దాడికి తెగబడే అవకాశాలూ ఎక్కువే. అందుకే 63 మిల్లీమీటర్ల మందంతో కాంక్రీట్, స్టీల్ కలగలిపిన బ్లాస్ట్‌ప్రూఫ్ పిల్లర్లను నిర్మించారు. హిమాలయ పర్వతాల ఎత్తుపల్లాల్లో ప్రయాణించి సామగ్రిని చేర్చేందుకు తొలుత మార్గం లేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో నాది ఒక పాత్ర మాత్రమే. ముఖ్యంగా వాలు ప్రాంతాల్లో వంతెనను పటిష్ట పరిచే డిజైన్‌కు సంబంధించే నేను ఎక్కువ పనిచేశాను. అంత మాత్రాన నేనేదో గొప్ప అన్నట్టు ప్రచారం చేయడం సరికాదు. దీని నిర్మాణంలో వేల మంది పనిచేశారు. అందరూ ఈ ప్రశంసలకు అర్హులే! అప్పుడు గుర్రాలు, గాడిదలే వాహనాలు. ప్రస్తుతం జమ్మూ, శ్రీనగర్ నగరాల మీదుగా వెళ్లే విమానాల్లో ఈ వంతెన వచ్చినప్పుడు పైలట్లు ప్రత్యేక అనౌన్స్‌మెంట్ చేస్తున్నారు. ప్రయాణికులూ ఎంతో ఆసక్తిగా ఫొటోలు తీసుకుని ఆనందిస్తున్నారు. పదవల్లో వెళ్లి అంచనాలు వేసుకుని, తీవ్రమైన చల్లగాలులకు తట్టుకుంటూ, రోజుల తరబడి చంటిబిడ్డల్ని కూడా వదిలి తాను శ్రమించిన పని పూర్తవడం ఎంతో సంతోషంగా ఉందని చెబుతున్నారు మాధవీలత. త్వరగా కుటుంబంతో వంతెన మీదుగా ప్రయాణించాలని ఉవ్విళ్లూరుతున్నానంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు.

## పెద్ద మనుషులు



మా చిన్నప్పుడు 'పెద్ద మనుషులు' అనే మాట తరచుగా వినిపిస్తుండేది. పల్లెల్లో అప్పుడప్పుడూ ఇంటి చుట్టుపక్కల వాళ్లతో.. పొలాల దగ్గర.. ఇంట్లో చిన్నచిన్న తగాదాలు జరుగుతుండేవి. అప్పుడు అందరూ.. 'ఇగ పెద్దమనుషుల ముంగట్నే తేలాలె. ఉత్తగ ఇనెతట్టు లేరు' అనుకునేది. ఎక్కువగాఅన్నదమ్ములు, తండ్రి కొడుకుల ఆస్తి కొట్లాటలో, భూమి పంపకాలో, అమ్మకాలు %-% కొనుగోళ్లు జరిగినప్పుడు స్టాంపు కాగితం మీద ఒప్పందం రాయించుకోవడానికో మా నాన్న దగ్గరికి వచ్చేవారు. నాన్న పట్వారీ కనుక.. ఆయన మొత్తం రాశాక అక్కడున్న వాళ్లందరికీ వినిపించేలా ఆ ఒప్పంద పత్రాన్ని చదివేవాడు. ఆ సందర్భంగా కావి రంగు ధోతులు కట్టుకుని, పైన అంగీ కూడా లేకుండా చాలామంది వచ్చేవారు. వాళ్లు పాపం.. మా ఇంటి ముందు అరుగుల మీదనో, కిందనో కూర్చునేవారు. కొందరు మాత్రం కాస్త తెల్లటి ధోతులు, తెల్లటి అంగీలో, కమీజులో వేసుకుని తలకు రుమాలు చుట్టుకుని ఉండేవారు. వాళ్లే 'పెద్ద మనుషులు' అని తరువాత తెలిసింది. వాళ్లు మా ఇంటి వరండాలో కర్ర బల్లల మీదనో, రాతి అరుగుల మీదనో కూర్చునేవారు. కొన్నిసార్లు వాళ్లంతా బయటే మాట్లాడుకుని వచ్చేవారేమో.. తొందరగానే రాయడం, చదివి వినిపించడం అయిపోయి సంతకాలు పెట్టేవారు. పదిమందిలో ఎనిమిది మందికి అక్షరాలు రాయడం కూడా రాదు. వాళ్లు వేలిముద్రలు వేసేవారు. పెద్ద మనుషులు సాక్షి సంతకం చేసేవారు. ఇదంతా ఆదివారమో, సెలవు రోజునో అయితే మేము తలుపుల వెనుక నుంచి ఆసక్తిగా తొంగి చూసేవాళ్లం. కొన్నిసార్లు ఆడవాళ్లు కూడా వచ్చేవారు. వాళ్లు చీరను మోకాళ్ల కింది దాకా గోచి పోసి కట్టి రవిక తొడుక్కునేవారు. చాలామంది జుట్టు దువ్వుకోకుండానే ఊరికే సిగ చుట్టుకునేవారు. బాగా తయారవ్వాలనే శ్రద్ధ ఎవరికీ ఉండేదే కాదు. ఎవరైనా జడ వేసుకుంటే.. 'అగో.. సూసినవానవ్వా! జారు జెడేసింది. సోకులు జూడు!' అని విమర్శించేవారు. ఎవరెంత అరిచినా.. నాన్న మాత్రం నవ్వుతూ అందరి మాటలూ వినేవాడు. ఆడవాళ్లకు ఏమైనా ఫిర్యాదులుంటే చెప్పమనేవాడు. "మా ముసలాయిన ఉన్నకాడికి భూమిని ముగ్గురు కొడుకులకు పంచిండు. నన్ను ఒక్కమాట అడుగలే! అండ్ల మా అవ్వగారు నాకిచ్చిన ఎకురం భూమిసుత ఉన్నది. మరి రేపటికెల్లి మేము ఏడ ఉండాలె? ఏమి జెయ్యాలె? ఏమి తినాలె?!" అని ఒకసారి ఒకామె అడిగింది."మేము లేమా అవ్వా?! నీకు, అయ్యకు బుక్కెడు బువ్వ పెట్టమా?!" అన్నాడు ఓ కొడుకు. "ఆc.. పెత్తురు! నీ పెండ్లం మా మొకాన పెండ నీళ్లు కొట్టకుంటె సాలు" అన్నదామె. నాన్న వెంటనే..

"ఏమయ్యా! మరి ఆమె అడిగింది కూడ న్యాయమే గద! ఆమె భూమి ఆమెకైన ఉంచండి. పెద్దమనుషులూ.. ఏమంటరు?!" అనడిగాడు. చివరికి ఆమె సొంత భూమి మినహాయించి మిగతాది మాత్రమే పంచేటట్టూ, ఆ ముసలాళ్ల తదనంతరం మాత్రమే ఆ భూమి సంగతి చూసేటట్టూ ఒప్పందం మార్చి రాసుకున్నారు. అంతా అయిపోయి వాళ్లు వెళ్లిపోయాక నాన్న లోపలికి వచ్చి.. "ఆడవాండ్లు బాగ మారుతున్నరు, ఆలోచిస్తున్నరు. మంచిదే!" అన్నాడు. నాకెందుకో ఆ మాట బాగా గుర్తుండిపోయింది. ఇక విడాకులు, ఇళ్లల్లో పంచాయితులు, కొట్టుకోవడాలు, భార్యాభర్తల గొడవలు మాత్రం మా ఇంట్లోకి, నాన్న దాకా వచ్చేవి కావు. కానీ, చాలాసార్లు మా ఇంటి ముందున్న రెండు వేపచెట్ల అరుగుల మీద గుంపులు గుంపులుగా కూర్చుని తేల్చుకునేవారు. అప్పుడు కూడా ఇలాంటి పెద్ద మనుషులే వచ్చేవారు. ఎంత కష్టమైన గొడవైనా రెండు మూడు సిట్టింగుల్లో వాళ్లు తేల్చి వేసేవారు. అయితే ఈ గొడవ పడ్డవాళ్లు సాయంత్రం పెద్ద మనుషులను తీసుకెళ్లి కల్లు తాగించడం, మాంసం తినిపించడం, డబ్బులివ్వడం చేయాలనే విషయం ఎవరో చెబితే ఆశ్చర్యం వేసింది. పెద్ద మనుషులంటే మరో అర్థం తెలిసింది.. నేను ఎనిమిదో, తొమ్మిదో క్లాసులో ఉన్నప్పుడనుకుంటా! తొమ్మిది, పదో తరగతుల్లో మా క్లాసులో అప్పుడొకరూ, ఇప్పుడొకరూ అమ్మాయిలు సడన్‌గా పదకొండు రోజులు మాయమయ్యేవారు. పన్నెండో రోజు ఎంతో బిడియపడుతూ, ఏదో తప్పు చేసినట్టు స్కూలుకు వచ్చేవారు. అంతలోనే క్లాసులో గుసగుసలు మొదలయ్యేవి. కొందరైతే మళ్లీ బడికి వచ్చేరోజు ఓణీలు వేసుకొచ్చేవారు. ఎవరైనా రెండు మూడు రోజులు దాటి రాకపోతే.. "హైమావతి ఎందుకొస్తులేదోయ్?!" అనడిగితే.. ఆమె క్లోజ్ ఫ్రెండో, ఇంటి పక్కమ్మాయో "ఏ..

పెద్దమనిషయింది గాదు!" అని చెప్పేది. ఓసారి అమ్మను అడిగి పెద్దమనిషి అవడం ఏమిటో తెలుసుకున్నాను. దాని ప్రకారం ఈ పెద్ద మనుషులయ్యే బాధ్యత, జాగ్రత్తగా ఉండాల్సిన వ్యవహారం, దానికి సంబంధించిన కష్టం అంతా కూడా అమ్మాయిలకే ఉంటుందనే కఠిన వాస్తవం తెలిసొచ్చింది. అయితే, ఇప్పట్లా ఫలానా అమ్మాయి పెద్దమనిషి అయిందని ఊరూవాడా తెలిసేలా ఎవ్వరూ గ్రాండ్‌గా ఫంక్షన్ చేసేవాళ్లు కాదు. ఏ కొద్దిమందో డబ్బున్నవాళ్లు ఓ నగ చేయించి, పట్టులంగా కుట్టించి, దగ్గరి బంధువుల్ని, ఒకరిద్దరు స్నేహితుల్ని పిలిచి ఫంక్షన్ చేసేవాళ్లు. పెద్దమనిషైన తరువాత అమ్మాయిలకు ఆటపాటల్లో అంతకుముందున్న స్వేచ్ఛ తగ్గిపోయేది. అబ్బాయిలతో కలివిడిగా ఉండటం అస్సలే ఉండకపోయేది. అధిక సంతానం ఉన్నవాళ్లూ, మధ్య దిగువ మధ్య తరగతివాళ్లూ అమ్మాయి పెద్దమనిషయిందంటే చాలా బెంగపడేవారు. ఎందుకంటే ఇక చుట్టుపక్కల వాళ్లంతా 'అమ్మాయి పెళ్లెప్పుడు చేస్తరు?' అని అడుగుతారని! మా దగ్గరి బంధువులకు ఆరుగురు అమ్మాయిలు. కొడుకు పుడతాడని చూస్తూ పోయారన్న మాట. ఆఖరమ్మాయి పెద్దమనిషి అయినప్పుడు తల్లిదండ్రులతోపాటు అక్కలూ కన్నీళ్లు పెట్టుకున్నారు. తరువాత అందరి పెళ్లిళ్లూ అయ్యాయనుకోండి. మొత్తానికి మగవాళ్లు అరవై దాటితే గానీ.. లేదా బాగా అనుభవం సంపాదిస్తే గానీ పెద్ద మనుషులు కాలేరు. అమ్మాయిలు పదిహేనేళ్లకే అవుతారు. అదన్నమాట.. పెద్ద మనుషుల సంగతి.

## సవాలు లేని సైకిల్ సవారీ



సైకిల్ అంటే చిన్నప్పటి కోరిక ఎంత మాత్రం కాదు. నాలుగు దశాబ్దాల కిందట మగపెండ్లివారు సగర్వంగా అడిగే కట్నకానుక కూడా కాదు. మన అభివృద్ధి, సుస్థిరత, ఆరోగ్యం దిశగా అదో అద్భుతమైన పరికరం. మన శారీరక శ్రమే దానికి ఇంధనం. చెమటోడ్చి తొక్కే కొద్దీ శక్తినిచ్చే సాధనం సైకిల్. సవాల్లేని సైకిల్ సవారీ వల్ల కలిగే ప్రయోజనాలు ఇవి..

**కాలుష్య రహితం:** రవాణా సాధనాల్లో సైకిల్ ఎలాంటి ఇంధనం లేకుండానే నడుస్తుంది. కాలుష్యం ఉండదు. ట్రాఫిక్ జామ్స్ ఉండవు. ఇంధన ఖర్చులూ ఉండవు.

**చవకైన రవాణా:** సైకిళ్లు రవాణా ఖర్చులను పూర్తిగా తొలగిస్తాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పిల్లలు బడికి వెళ్లాలన్నా, రైతులు పొలాలకు వెళ్లాలన్నా, కూరగాయల్లాంటి పంటలను మార్కెట్లకు తరలించడానికి సైకిళ్లనే ఆశ్రయిస్తుంటారు. చిన్నాచితక పనులకు వెళ్లే వాళ్లకు కూడా ఇవే ఖర్చులేని రవాణా సదుపాయం.

**శారీరక మానసిక ఆరోగ్యం:** సైకిల్ తొక్కడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. శారీరక బలం పెరుగుతుంది. క్యాలరీలు కరిగిపోతాయి. తాజా గాలిలో, ఆరుబయట ఏకాంతంగా సైకిల్ తొక్కుతూ ఉంటే మనసుకు ఆహ్లాదంగా, ఉల్లాసంగా, ఉపశమనంగా ఉంటుంది.

**సుస్థిరం:** పెట్రోలు, డీజిల్ వాడకం వల్ల కాలుష్యం పెరుగుతున్నది. వాతావరణ మార్పులు తలెత్తుతున్నాయి. ఇలాంటప్పుడు దగ్గరి ప్రయాణాలకు సైకిల్ మంచి పరిష్కారం.

**జీవనాడి:** ఇప్పటికీ ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో చాలామందికి సైకిల్ జీవనాడి. వైద్య సహాయం పొందాలన్నా, పిల్లలు బడికి వెళ్లాలన్నా, పెద్దలు ఉద్యోగాలు చేసుకోవాలన్నా గమ్యం చేరుకోవడానికి సైకిల్ ఖర్చులేని వాహనం.